నానోతో మేలు

- పంటలకు ఉపయోగంగా ద్రవరూప యూరియా
- నత్రజని ఎరువుల వాడకంతో భూసారానికి ముప్పు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ
- పర్యావరణ పరిరక్షణ హితం
- జిల్లాలో 4.45 లక్షల ఎకరాల్లో పంటల సాగు



నానో యూరియా లిక్విడ్
దహెగాంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రామకృష్ణ

నత్రజని ఎరువుల వినియోగంతో భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో యూరియా వాడకానికి బదులుగా ద్రవరూపంలోని నానో యూరియాపై జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నానో యూరియాతో పంటలకు, భూసారానికి మేలు జరుగుతుందని అధికారులు తెలియజేస్తున్నారు.

కాగజ్‌నగర్ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు ఎరువుల వినియోగాన్ని దశల వారీగా తగ్గించేందుకు ప్రభుత్వం పలు రకాల ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా నానో యూరియా వాడకంతో రైతులకు ధర తక్కువతో ప్రయోజనం ఎక్కువగా కల్పించే దిశగా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖకు ఆదేశాలు ఇచ్చి ప్రయోగాత్మకంగా తీర్చిదిద్దుతోంది. జిల్లాలో నాలుగేళ్లుగా నానో యూరియాను వాడాలని సూచనలు చేస్తున్నారు. నానో యూరియా వాడకం వలన ఒక్క యూరియా బస్తాకు ఉన్న ధర కంటే 500 మిల్లీమీటర్ల నానో యూరియా బాటిలును తీసుకుకోవచ్చు. దీన్ని పిచికారి చేయడం వలన యూరియా బస్తాల ధరతో పాటు, రవాణా ఛార్జీలు భారం తగ్గుతుందని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. దీంతో పాటు భూముల స్వభావం దెబ్బతినకుండా ఉండేందుకు, వాతావరణ కాలుష్యం లేకుండా ఉండే విధంగా నానో ద్వారా మార్పులు వస్తాయని చెబుతున్నారు. సీసాలో ద్రవ రూపంలో ఉండే నానో యూరియా, డీఏపీ లిక్విడ్ అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా నానో యూరియా, డీఏపి అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. దీని వినియోగం వలన ఖర్చు తగ్గడమే కాకుండా అధిక దిగుబడి సాధించవచ్చని పేర్కొంటున్నారు. సాధారణంగా బస్తా యూరియా పంటకు వేస్తే 30 శాతమే అందుతుంది. అదే నానో యూరియా అయితే 80 శాతం మేర పంట దిగుడి అందుతుందని చెబుతున్నారు.

● ఖర్చు తగ్గించేందుకు..

రైతులు ఎరువుల వినియోగానికి కూలీలు, తదితర ఖర్చులకు అధిక మొత్తంలో వెచ్చిస్తుంటారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం నానో యూరియా లిక్విడ్, డీఏపీని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని వినియోగం పట్ల అవగాహన లేక పోవడం తో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నానో యూరియా వాడకం వలన దిగుబడులు పెరుగుతాయి. అర లీటరు సీసా నానో యూరియా రూ. 220కే లభ్యమవుతోంది. అదే 45 కిలోల యూరియా బస్తా రూ. 266 వరకు ధర ఉంటోంది. ఎకరాకు అర లీటర్ నానో యూరియా సరిపోతుందని, తద్వారా ఖర్చు కూడా తగ్గుతుందని, రైతులకు సూచనలి స్తున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు 1.45 లక్షల రైతులున్నారని వ్యవసాయ శాఖాధికా రులు తెలిపారు. 4.45 లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. వానా కాలంలో సుమారు వరి 58వేల నుంచి 60 వేల ఎకరాలు సాగు చేస్తుండగా, పత్తి 3.30 లక్షల ఎకరాలు, కంది 35 ఎకరాలు, ఇతర పంటలు 30 వేల ఎకరాల్లో పండిస్తారని అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా యూరియా 60 వేల మెట్రిక్ టన్నులు, డీఏపీ 20 వేలు, ఎంవోపీ 15 వేలు, కాంప్లెక్స్ ఎరువులు 20 వేలు, ఎస్‌ఎస్‌పీ 20 వేల మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. అవసరం మేర యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఈ నానో యూరియా వాడకం పెరిగితే ఏటా యూరియా, డీఏపీ కొరత నుంచి రైతులకు ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు. నానో యూరియానే అన్నింటికి చక్కటి పరిష్కారమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

లాభాలు ఇవీ..

నానో యూరియాను భారతీయ రైతాంగ సంస్థ (ఇఫ్కో) రూపొందించింది. 500 మిల్లీలీటర్ల బాటిల్ నానో యూరియా ఒక యూరియా బస్తాతో సమానం. వృథా తక్కువ. పర్యావరణహితమైంది. మట్టి, నీటి కాలుష్యం తగ్గిస్తుంది. ఖర్చు తక్కువ. నీటి కాలుష్యం తగ్గిస్తుంది. ఖర్చు తక్కువ. ఉపయోగం ఎక్కువ. సకాలంలో వాడితే దిగుబడి మెరుగుపడు తుంది. దీన్ని మొక్కలకు మొదటిసారి 30 నుంచి 35 రోజుల సమయంలో స్ప్రే చేయాలి. రెండోసారి అవసరమైతే 50 నుంచి 55 రోజుల సమయంలో స్ప్రే చేయాలి. సాధారణంగా బస్తా యూరియాను వేస్తే 30 నుంచి 40 శాతం మాత్రమే మొక్కలను అం దుతుంది. మిగితా మొత్తం నీళ్ల రూపంతో భూమిలోకి ఇంకుతుంది. దీంతో సారవంతమైన నేలలు ఆమ్ల భూములుగా మారి దిగుబడి తగ్గుతుంది. అదే నానో యూరియా పిచికారి చేస్తే 80 నుంచి 90 శాతం వరకు మొక్కలకు అందుతుంది. దీన్ని నేరుగా నేలలో పోయవద్దు. దీంతో పాటుగా ఇతర కెమికల్స్, రసాయనాలతో కలపకూడదు. నాలుగు లీటర్ల నీటిలో 500 మిల్లీలీటర్ల నానో యూరియా కలిపి స్ప్రే చేయాలి. ఎకరానికి రెండు బాటిళ్ల సరిపోతాయి. ఉదయం కానీ సాయంత్రం సమయంలో ఆకుల మీ దకు సమంగా పిచికారి చేయాలి. దీని వల్ల రైతులకు పంట దిగుబడి పెరుగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడుతుంది. సరైన పద్ధతిలో వాడితో మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు


దుబ్బగూడలో బావిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

జైనూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వాసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జైనూరు మండల పరిధిలో గల ఉషేగాం పీహెచ్‌సీని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని వార్డులను, ల్యాబ్, మందులు నిలువలు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, పారిశుధ్యం నిర్వాహణ, తదితర అంశాలను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేట్టాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం కేజీబీవి విద్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. వంట గదిలో అన్నం పప్పు దినుసులను పరిశీలించారు. మండలంలోని దుబ్బగూడలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను అదనపు కలెక్టర్ పరిశీలించారు. గ్రామ పరిసరంలో ఉన్న బావిని పరిశీలించి వాటిని వారానికి ఒక సారి నీటిలో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ ఆడ బీర్షావ్, ఎంపీఒ మోహన్, వైద్యధికారి రాజు,హెచ్ఈఒ రమేష్, స్టోర్ ఇన్‌చార్జి మంగల్ సోలంకి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పెంచికలపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపైనే దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. జల్లా ఉత్తమ పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైన పెంచికలపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. ఇందుకు గాను ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ గ్రామీణ విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన అన్నారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి ప్రత్యేక చరయలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. కేంద ప్రభుత్వ పథకమైన పీఎంశ్రీ నిధులను సద్వినియోగం చేసుకుని జిల్లాలోనే ఉత్తమ పాఠశాల కావడంలో ఉపాధ్యాయుల కృషి ఉందని ఆయన అన్నారు. పీఎంశ్రీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఈ పాఠశాలకు రూ.18 లక్షలు మంజూరు చేసిందని, ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడంతో అనందంగా రూ.15 లక్షల నిధులు అందనున్నాయని తెలిపారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ అంశంపై బోధన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, నాయకులు రాజేశ్వర్, నాగేష్, రాజన్న, ప్రభాకర్, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సీటు ఇప్పిస్తానని డబ్బులు వసూలు

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా గురుకుల విద్యాలయాల్లో సీట్లు ఇప్పిస్తానని 26 మంది విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ఓ వ్యక్తి మంత్రి పేరు చెప్పి డబ్బులు వసూలు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాత్మజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో సీట్లు ఇప్పిస్తానని ఆసిఫాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి మంత్రి సీతక్క అనుచరుడినని చెబుతూ సిర్పూర్(టి), కాగజ్‌నగర్, కౌటాలతో పాటు పలు మండలాల్లో విద్యార్థుల నుంచి ఒక్కో సీటుకు రూ.20 వేల చొప్పున మాట్లాడుకున్నాడు అడ్వాన్సుగా ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.10 వేల చొప్పున తీసుకున్నాడు. తీరా సీటు ఇప్పించాలని ఒత్తిడి చేయడంతో మంత్రి పేరుతో ఒక లెటర్‌ను చూపించి నమ్మబలికాడు. విద్యార్థుల నుంచి డబ్బులు తీసుకోవడమే కాకుండా వారు చదువుతున్న పాఠశాల నుంచి టీసీలు సైతం తీసుకోమని చెప్పాడు. దీంతో వారు టీసీలు తీసుకొని సిద్ధంగా ఉన్నారు. అటు గురుకులాల్లో అడ్మిషన్ దొరకక పాఠశాలలో చేరలేక ఎక్కడ చదవాలో అర్థం కాక విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సదరు వ్యక్తిపై విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


రికార్డులను పరిశీలిస్తున్న వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్

కాగజ్‌నగర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వర్షా కాలంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ తెలిపారు. కాగజ్‌నగర్ సీహెచ్‌సీని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులతో ఆయన మాట్లాడి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది 24 గంటల పాటు వైద్యసేవలు అందించాలని ససూచించారు. వివిధ సమస్యలను పరిష్కరించటం లేదని ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆయన దృష్టికి తీసుకవచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ సీహెచ్‌సీలో పలు సమస్యలున్నాయని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహం భవన నిర్మాణానికి భూమి పూజ

లింగాపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాల సమీఎంలో మంగళవారం మండల అధికారులు, నాయకులు పీఎం జుగా పథకంలో రూ. 2కోట్ల 70 లక్షలతో మంజురైన బాలురుల వసతి గృహ భవనం పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్, ఆర్వీఎం ఏఈ శశిధర్, ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాదవ్ లోకేందర్, లింగాపూర్ గ్రామ నాయక్ రాథోడ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎఫ్‌ఆర్వో గోవింద్ చంద్ సర్దార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ యాదగిరితో కలిసి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీప్యూటీ ఆర్వో యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ

వాంకిడి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని బంబార బాలుర గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు.

ముందస్తుగా గురుకుల పాఠశాలకు సెలవులు

సిర్పూర్(టి), జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు తరగతి గదులు పైకప్పు స్లాబ్ ఉరుస్తుండడంతో ముందస్తుగా విద్యార్థులకు నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను ఫోన్‌లో వివరణ కోరగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భవన పరిస్థితులు బాగా లేక పోవడంతో రీజనల్ కో ఆర్డినేటర్, రాష్ట్ర కార్యదర్శి ఆదేశాల మేరకు సెలువులు ప్రకటించామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్/కాగజ్‌నగర్//దహెగాం/పెంచికలపేట/కెరమెరి/రెబ్బెన/సిర్పూర్(యు)/లింగాపూర్/బెజ్జూరు/చింతలమానేపల్లి//సిర్పూర్(టి), జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాగుల పంచమి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు పుట్టలో నాగదేవతకు పాలు పోసి నైవేద్యాలు సమర్పించారు. జిల్లాలోని మహిళలు తమ కుటుంబాలను నాగదేవత సంరక్షించాలని పుట్లలో పాలు పోసి పూజించారు. దేవతామూర్తుల దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయాల్లో సందడి నెలకొంది. పసుపు కుంకుమలు వాయినాలుగా పంచుకున్నారు.. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని నాగసుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్‌దోత్రే దంపతులు పాల్గొని అర్చకుడు శిరీష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని బజారువాడి, దస్నాపూర్, హనుమాన్ మందిర్, జన్కాపూర్, సందీప్‌నగర్, చెక్‌పోస్టు కాలనీలో మహిళలు పెద్ద ఎత్తున పుట్టల వద్ద పాలు పోసి నైవేద్యాలు సమర్పించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో రాంమందిర్ ఆలయంలో, ఓల్డు కాలనీ హనుమాన్ ఆలయంలో నాగు పాము పుట్టల వద్ద మహిళలు ఉదయం నుంచి పాలు పోశారు. అలాగే స్థానిక శివనాగరాజు ఆలయంలో ఉదయం నుంచి పాలు పోసేందుకు మహిళలు బారులు తీరారు. రెబ్బెన మండలం ఇందిరనగర్‌లోని అమ్మవారి ఆలయంలో పుట్టలో మహిళలు పాలు పోశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి దేవర వినోద్ స్వామి భక్తులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సిర్పూర్(యు) మండల కేంద్రంలో గల ప్రాచీన మహాదేవ్ ఆలయంతోపాటు హన్మాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల ఆదివాసీలు కేస్లాపూర్‌లోని నాగోబా దేవతను దర్శించడానికి తరలివెళ్లారు. సిర్పూర్ (టి) నాగమ్మ చెరువు వద్ద పుట్టల వద్ద పాలు పోసి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వేంకటేశ్వ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఆసిఫాబాద్‌లో పుట్టలో పాలు పోస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే దంపతులు


కాగజ్‌నగర్‌లో హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


సిర్పూర్(టి)లో..


బెజ్జూరులో..

అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తాం

కెరమెరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి పేదవారికి రేషన్ కార్డులు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. కెరమెరి మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి లబ్ధిదారులకు రేషన్ కార్డులను ఎమ్మెల్సీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుదీర్ఘకాలం తరువాత నిరుదపేలకు రేషన్ కార్డులు అందుతున్నాయని, రేషన్ కార్డు పేదవారికి వరం లాంటిదని తెలిపారు. రేషన్ కార్డుతో రేషన్ కార్డులతో సన్న బియ్యం, ఆరోగ్య శ్రీ పథకం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇంది రమ్మ ఇళ్లతో పాటు అనేక సంక్షేమ పథకాలు లబ్ధి పొందుతారని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన పేదలకు చౌక ధరల దుకాణం ద్వారా రేషన్ కార్డుదారులకు సన్న బియ్యంను ఉచితంగా అందిస్తుందని, ఆరోగ్య శ్రీ పథకం పరిమితి రూ.10 లక్షలకు పెంచిందని తెలిపారు. కలెక్టర్ వెంకటేష్‌దోత్రే మాట్లాడుతూ రేషన్ కార్డు దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఎక్కువగా రేషన్‌కార్డుల కోసమే దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి వెంకటి, తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో అంజద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

జైనూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాయని జైనూర్ మార్కెట్ కమిటీచైర్మన్ కుడిమెత విశ్వనాథ్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో (ధర్తి అబ్ జన జాతీయ ఉత్కర్ష్ అభియాన్) డిఏజీయుఎస్ పథకం కింద జైనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంజూరైన 2 కోట్ల 70 లక్షల నిధులతో చేపట్టనున్న వసతి గృహ భవనం పనులకు మంగళవారం మండల స్థాయి అధికారులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, తహసీల్దార్ ఆడ బీర్షావ్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంఈవో జాదవ్ మధుకర్, ఈవో రోనూంద ఆనందరావ్, ఢబోలి గ్రామ కార్యదర్శి రాజ కుమార్, పార్టీ మండల అధ్యక్షులు అబ్దుల్ ముకీద్, విద్యా కమిటీ చైర్మన్ గున్వంత్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పులుల రక్షణతో పర్యావరణ సమతుల్యాత



సిర్పూర్(టి)లో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారుల


ఆసిఫాబాద్‌లో ర్యాలీ ప్రారంభిస్తున్న అటవీ డివిజన్ అధికారి దేవిదాస్

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పులుల రక్షణతో పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందని ఆసిఫాబాద్ అటవీ డివిజన్ అధికారి దేవి దాస్ అన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని ఆసిఫాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో రేంజ్ అధికారి గోవింద్ చంద్‌సర్దార్, డీప్యూటీ ఎఫ్‌ఆర్వో యోగేష్, యూన్సీరాణి, విజయ్‌ప్రకాష్, సెక్షన్ అధికారులు మహేందర్, విజయ్, సతీష్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): పులల రక్షణతో పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని ఎఫ్‌ఆర్వో సుభాష్ అన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో జయరాజ్, ఏఎస్సై మను, డిప్యూటీ ఎఫ్‌ఆర్వో షైమావతి, ఎఫ్‌బీవోలు ప్రభాకర్, సుక్క, ఉపాధ్యాయులు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎఫ్‌ఆర్వో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పులుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అంతరించి పోతున్న జాతిని రక్షించడం మనందరి కర్తవ్యమని చెప్పారు. చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీప్యూటీ ఆర్వో శశిధర్, ఎఫ్‌ఎస్‌ఓ తులసీదాస్, తిరుపతి, అతరుద్దీన్, ప్రసాద్ రావు, మోతిలాల్, వందన, ఎఫ్‌బీఓలు లక్ష్మి, రవీనా, శ్రీదేవి, అనూష, సంతోష్, మల్లికార్జున్, అరవింద్, అరుణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): అడవుల రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పెద్ద పులను సంరక్షించేందుకు ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని రేంజ్ అధికారి ముసావీర్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ పెద్దపులుల దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో సునీత, డిప్యూటీ ఆర్వో శ్రావణ్, సిబ్బంది పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జోడెఘాట్ అటవీ క్షేత్రాధికారి జ్ఞానేశ్వర్ అధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా అటవీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, సీఐ వెలుప్పల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో హై అలెర్ట్

జాతీయ రహదారిపై పోలీసుల ముమ్మర తనిఖీలు



అంతర్రాష్ట్ర వంతెన వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కోటపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులో పోలీసులు హై అలెర్ట్‌ప్రకటించారు. సోమవారం నుంచి ప్రారంభమైన మావోయిస్టు పార్టీ వారోత్సవాలు ఆగస్టు 3 వరకు కొనసాగనుండడంతో సరిహద్దు ప్రాంతాలను పోలీసులు జల్లెడ పడుతున్నారు. మండలంలోని ప్రాణహిత సరిహద్దు తీర గ్రామాలతో పాటు జాతీయ రహదారిపై, అంతర్ రాష్ట్ర వంతెన వద్ద మంగళవారం పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్, కోటపల్లి ఎస్‌ఐ రాజేందర్‌ల ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. రాపన్‌పల్లి సమీపంలోని అంతర్‌రాష్ట్ర వంతెన వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానితుల వివరాలను సేకరించారు. ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు , బస్సులను సైతం తనిఖీలు చేసి ప్రయాణికుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మావోయిస్టులు అడవుల్లో ఉండి హింసాత్మక ఘటనలకు పాల్పడుతూ సాధించేది ఏమిలేదని, జన జీవన స్రవంతిలో కలిసి కుటుంబీకులతో కలిసి జీవితం గడపాలన్నారు.

తాపీ మేస్త్రీ అదృశ్యం

కాసిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన తాపీ మేస్త్రీ గొర్లపల్లి సురేశ్(40) పది రోజుల నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు స్థానిక కాసిపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సురేశ్ తాండూర్ మండలం ద్వారక కాసిపేటకు చెందినవాడు. కాసిపేట మండల కేంద్రానికి చెందిన జాడి వనమాలతో 2015లో వివాహం అయింది. తాపీ పనులు చేస్తూ జీవితం గడిపేవారు ఐదేళ్ల క్రితం కాసిపేటలోని అత్తారింటికి వచ్చి తాపీ పనులు చేసుకుంటున్నాడు. ఈ నెల 19న పనికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటిలో నుంచి వెళ్లిపోయాడు. కానీ ఇంటికి తిరిగిరాలేదు. మరుసటి రోజు కుటుంబ సభ్యులు ఆచూకి కోసం గాలించగా జాడ తెలియకపోవడంతో ఆదివారం 27న గొర్లపల్లి పోసక్క స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై కాసిపేట ఎస్‌ఐ ఆంజనేయులను వివరణ కోరగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 8096403402, 8712656571 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గుడుంబా పట్టివేత

భీమారం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : భీమారంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం పది లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు భీమారం ఎస్‌ఐ శ్వేత, ఎక్సైజ్ ఎస్‌ఐ శంకర్ తెలిపారు. పులిమడుగు గ్రామానికి చెందిన కుంసోత్ వెంకటేష్ తన ఆటోలో గుడుంబాను తరలిస్తున్నాడనే సమాచారం మేరకు ఆటోను వెంబడించి పట్టుకున్నామన్నారు. అతని వద్ద 10 లీటర్ల గుడుంబాను, ఆటోను స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. పట్టుకున్న గుడుంబా విలువ రూ. 4 వేలు ఉంటుందని తెఇపారు. గుడుంబా అక్రమంగా రవాణా చేసినా, తయారు చేసినా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు మహేం దర్, సంతోష్, ఎక్సైజ్ సిబ్బంది రాజేంద్రప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రావడం లేదని యువకుడి ఆత్మహత్య

కెరమెరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుడుపల్లి గ్రామానికి చెందిన నవీన్(27) ఉద్యోగం రావడం లేదని మనస్తాపంతో మంగళవారం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఏడాది క్రితం నిర్వహించిన డీఎస్సీలో ఉద్యోగం రాక పోవడంతో తన స్నేహితులు, బంధువుల వద్ద తరుచు ఆవేద వ్యక్తం చేసేవాడని చెప్పారు. ఈ క్రమంలో పంట చేనులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. నవీన్ తండ్రి నానాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రాగి జావ ఎప్పుడు?

- గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ
- ఈ విద్యాసంవత్సరం నిలిచిన సరఫరా



బెజ్జూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు మరింత పౌష్టికాహారాన్ని అందించేందుకు గతేడాది ప్రభుత్వం రాగిజావ పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు పీఎం పోషన్ కింద రాగిజావ పంపిణీ చేశారు. గత విదా సంవత్సరం ముగింపు వరకు విద్యార్థులకు రాగిజావను అందించారు. కానీ ఈ విద్యాసంవత్సరం ఇప్పటికీ ప్రారంభించలేదు. 2025-26విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నుంచి రాగి పిండి, బెల్లం ప్యాకెట్లు ఇంకా సర్కారు బడులకుసరఫరా కాలేదని తెలుస్తోంది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 15మండలాల పరిధిలో మొత్తం 992ప్రభుత్వ పాఠశాలలున్నాయి. జిల్లాలో వివిధ పాఠశాలల్లో 47,200మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

వారంలో మూడు రోజులు..

గతేడాది విద్యార్థులకు అందజేసిన రాగిజావ, బెల్లం పొడి పంపిణీకి శ్రీకారం చుట్టగా,ఈ ఏడాది ఇప్పటికీ పంపిణీకి నోచుకోలేదు. వారంలో మధ్యాహ్న భోజనంలో గుడ్డు పెట్టని మూడు రోజుల్లో ప్రతీ విద్యార్థికి 10గ్రాముల బెల్లం పొడి కలిపిన జావను అందించారు. ఉదయం విరామం సమయంలో రాగిజావ అందించడంతో పోషకాలు అందుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. రాగిజావ తీసుకోవడం వల్ల విద్యార్థుల్లో పౌష్టికాహారంతో పాటు చురుకుగా ఉంటారని బావించి ప్రభుత్వం పంపిణీకి చర్యలు తీసుకుంది. రాగిజావతో వారికి ఆరోగ్యకరంగా మేలు చేస్తుందని పలువురు నిపుణులు తెలుపుతున్నారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా రాగిజావ పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఆదేశాలు రాలేదు.. సునీత, ఎంఈవో, బెజ్జూరు

ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావ పంపిణీకి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. దానికి అవసరమైన రాగి పొడి, బెల్లం పొడి సామగ్రి రాలేదు. దీంతో విద్యార్థులకు అందించడం లేదు. ప్రభుత్వం సరఫరా చేస్తే పాఠశాలల్లో పంపిణీ చేస్తాం.

తిర్యాణిని అభివృద్ధి చేస్తాం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

తిర్యాణి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దం డె విఠల్ అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో రూ.3.25 కోట్ల నిధులతో మంజూరైన బాలుర వసతి గృహాన్ని సంబంధించిన శిలాఫలకాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు అనిల్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మండలంలోని గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడున్న సమస్యను ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను సందర్శించి పరిసరాలను గమనించారు. ముఖ్యంగా గురుకులంలో నీటి సమస్యతో పాటు డార్మెంటరీ, సమస్యలు ఉన్నట్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకు వచ్చారు. సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ల బాధ్యత తమపై ఉందని పేర్కొన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.3.25 కోటలతో బాలుర వసతి గృహాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో అంజయ్య, ఎంపీడీవో మల్లేష్, నాయకులు హరీష్‌కుమార్, రాజు, వెంకటేశం, విజయ్, చిన్నయ్య, శంకర్, కొమురయ్య, కిష్టయ్య, అశోక్, లచ్చన్న, శంకర్, అమర్ పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన తహసీల్దార్

కౌటాల, జూలై 29(ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం తహసీల్దాద్ ప్రమోద్ తనిఖీ చేశారు. ఈ సంర్భంగా ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్, మధ్యాహ్న భోజనం, స్టాక్ రిజిస్టర్, వంట శాల, నీటి వసతి, మరుగుదొడ్ల శుభ్రతను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని చెప్పారు. భోజనం నాణ్యంగా ఉండేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. సమస్యలు ఉంటే దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

తాండూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : తన ఆటోలో మర్చిపోయిన ఫోన్‌ను తిరిగి అందజేసి ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం బురదగూడెంకు చెందిన కామెర్ల లింగన్న మంచిర్యాల నుంచి మందమర్రికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో తన ఫోన్‌ను ఆటోలోనే మర్చిపోయి దిగిపోయాడు. ఫోన్‌ను ఆటో డ్రైవర్, తాండూర్ మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు మహహ్మద్ హబీబ్ పాషా గుర్తించాడు. ఫోన్‌కు ఇన్‌కమింగ్ కాల్ రావడంతో ఫోన్ మర్చిపోయిన విషయం తెలియజేశాడు. మందమర్రి టోల్ ప్లాజా వద్ద ఉంటానని సదరు వ్యక్తికి చెప్పాడు. దీంతో విషయం తెలుసుకున్న లింగన్న టోల్ ప్లాజా వద్దకు రాగా ఫోన్‌ను ఇంగన్నకు మహమ్మద్ హబీబ్ పాషా అందజేశాడు. ఆటో డ్రైవర్‌కు లింగన్న కృతజ్ఞతలు తెలిపాడు.

నవోదయలో ప్రవేశానికి గడువు పెంపు

కాగజ్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో 2026 సంవత్సరం ఆరో తరగతి ప్రవేశానికి ఆగస్టు 13 వరకు పెంచినట్టు నవోదయ విద్యాలయం డిప్యూటి కమిషనర్ నయన్ కిషోర్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

జైనూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జైనూర్ పోలీస్‌స్టేషన్‌తో పాటు సీఐ కార్యాలయాన్ని మంగళవారం ఏఎస్పీ చిత్తరంజన్ తనిఖీ చేశారు. ఈ మేరకు రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాత నేరస్తులపై నిఘా పెట్టాలన్నారు. శాంతిభద్రతల పరిక్షణలో కఠినంగా ఉండాలని తెలిపారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ సూచించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కెరమెరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వివిధ అనా రోగ్య సమస్యలపై వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని కెరమెరి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, అవుట్ పేషంట్‌సేవలు, మందుల నిలువలు పరిసరాలను పరిశీలించి జ్వర పీడితుల వివరాలను తెలుసుకొని వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కాకూడదని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా అవసరమైన మందులు నిలువలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించి పరిసరాలు, మెనూ పట్టిక, వంటశాల, భోజన నాణ్యతను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గణితం, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్టులపై విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి వెంకటి, డీఎంహెచ్‌వో సీతారాం, తహసీ ల్దార్ భూమేశ్వర్, ఎంపీ డీవో అంజద్‌పాషా, ఎంఈవో ప్రకాష్‌ఔ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజ నల్ వ్యాధు లు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకుంటున్నా మని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే మూడు నెలల కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురుసినందున సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు చేడుతామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సీతారాం, సూపరింటెండెంట్ చెన్నకేశవ్, వైద్యులు ఉన్నారు.

ఘనంగా కావడి యాత్ర

కాగజ్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో కావడి యాత్ర మంగళవారం నిర్వహించారు. వివిధ పుణ్య క్షేత్రాల నుంచి తీసుకొచ్చి జలాలను కావడిల ద్వారా ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు స్థానిక హనుమాన్ ఆలయం నుంచి ఈసుగాం శివమల్లన్న ఆలయం వరకు కొనసాగింది. అనంతరం ఈసుగాం శివమల్లన్న ఆలయంలోని శివలింగానికి గంగా జలాలను పోసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కావడి యాత్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

కౌటాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలోడి, ముత్తంపేట గ్రామాల్లో మంగళవారం పశువైద్యాధికారి శ్రీకాంత్, అంజలిలు పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి ఆగస్టు 8 వరకు శిబిరాల నిర్వహించి గొర్రల్లో నీలి నాలికల వ్యాధి నివారణకు టీకాలు వేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది భిక్షపతి, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

జైపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఐకే ఓసీపీలోని బలరామ జలధి వద్ద మంగళవారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని , సంస్థ సీఎండీ బలరాం జన్మదినోత్సవం సందర్భంగా మొక్కలు నాటామని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు భీభత్స, వెంకటేశ్వర్‌రెడ్డి, హరినాధ్, చంద్రశేఖర్, మేనేజర్లు నాగయ్య, శంకర్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హనుమాన్‌గౌడ్, మహేష్, జక్కారెడ్డి, భీమన్న పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీ ప్రాంగణంలో సింగరేణి సీఎండీ బలరాం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి , జీఎం శ్రీనివాసులు సీహెచ్‌పీ ప్రాంతంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధికారులు నర్సింహారావు, సముద్రాల శ్రీనివాస్, సత్య నారాయణ, మురళీధర్, మదన్‌మోహన్, శ్రీనివాస్, అజాజుల్లాఖాన్, కిరణ్‌బాబు, పంతుల, వెంకటయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): కాసిపేటగనిపై మంగళవారం కార్మికులు బల్‌రాం నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాసిపేట గని మేనేజర్ సతీష్, ఏఐటీయుసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగాం మల్లేశ్, ఐఎన్‌టీయుసీ కేంద్ర కమిటీ నాయకులు బన్న లక్ష్మణ్‌దాస్, కార్మిక సంఘాల నాయ కులు మీనుగు లక్ష్మీనారాయణ, సొల్లంగి శ్రీనివాస్, పర్వతి సురేశ్, నాగేశ్వర్‌రావు, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

20 వేల మొక్కలు నాటిన సీఎండీ

- 12 ఏరియాలు, 56 చోట్ల పెరుగుతున్న వనాలు
- విశ్వగురు ఫౌండేషన్ ద్వారా వరల్డ్ రికార్డు నమోదు



మొక్క నాటి సెల్ఫీ తీసుకుంటున్న సీఎండీ బలరాం(ఫైల్)

శ్రీరాంపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆయన ఎక్కడ అడుగుపెడితే అక్కడ పచ్చదనమే. తాను వెళ్లిన ప్రతీచోట మొక్కలు నాటడమే. దీనికి కారణం ఆయనకు పర్యావరణంపై ఉన్న అభిమానమే. ఇందులో భాగంగా ఆరేళ్ల క్రితం మొక్క నాటి మొదలుపెట్టిన ప్రస్థానం మంగళవారంతో 20 వేలకు చేరుకుంది. ఇది దేశంలోనే రికార్డు కాగా, సీఎండీ ఎన్. బలరాం ఈ ఫీట్ సాధించడంపై సింగరేణి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

2019లో మొదలు

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 2019, జూన్ 5వ తేదీన సింగరేణి సీఎండీ ఎన్. బలరాం కొత్తగూడెం బంగ్లాస్ ఏరియాలో 108 మొక్కలు నాటి మహావృక్ష యజ్ఞాన్ని ప్రారంభించారు. అనంతరం సింగరేణిలోని 12 ఏరియాల్లో, 56 ప్రదేశాల్లో ఆయన విస్తృతంగా మొక్కలు నాటారు. సింగరేణిలో సీఎండీగా తన విధులలో తలమునకలై ఉన్నప్పటికీ పర్యావరణం పై తనకున్న ప్రేమతో మొక్కలు నాటేందుకు సమయం కేటాయిస్తున్నారు. ఇలా రామగుండం-3 ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ బర్మ్‌పై 1251 మొక్కలు, శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్‌పై 1237 మొక్కలు నాటి హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారి నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. తన పుట్టిన రోజు అయిన మంగళవారం కొత్తగూడెం ఏరియాలోని జీకే ఓసీపీ డంప్‌పై 225 మొక్కలు నాటడంతో 20 వేల మొక్కలు నాటిన మైలు రాయిని చేరుకున్నారు. ఈ ఫీట్‌ను ప్రముఖ అంతర్జాతీయ సంస్థ అయిన విశ్వగురు ఫౌండేషన్ ఎండీ రాంబాబు మొక్కలు నాటడాన్ని వీక్షించారు. ఈ మేరకు వరల్డ్ రికార్డ్ పత్రాన్ని సీఎండీకి అందించారు.

జియో ట్యాగింగ్‌తో పర్యవేక్షణ

బలరామ్ తాను నాటిన ప్రతీ మొక్కకు జియో ట్యాగింగ్ చేశారు. మొక్కలు నాటి వదిలేయడం కాకుండా నిత్యం ఎదుగుదలను పర్యవేక్షిస్తున్నారు. ఒకవేళ మొక్క చనిపోతే వాటి స్థానంలో కొత్తవి నాటుతున్నారు. ఇప్పటి వరకు 90 శాతం మొక్కలు పాదుకొని నేడు వృక్షాలుగా ఎదుగుతున్నాయి.



కొత్త టబ్బులను అందుబాటులో ఉంచాలి

శ్రీరాంపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పాత టబ్బులను తొలగించి వాటి స్థానంలో కొత్త టబ్బులను అందుబాటులో ఉంచాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎస్‌ఆర్‌పీ 3 గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులకు సంబంధించిన రెస్ట్‌హాల్స్ వర్షానికి ఉరుస్తున్నాయని, వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, ప్రసాద్ రెడ్డి, ఏరియా కార్యదర్శి మూడ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా విధులకు హాజరు కావాలి

రెబ్బెన, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కావాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. మంళవారం గోలేటి సీఈఆర్ క్లబ్‌లో గైర్హాజరైన ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి ఎం.నరేందర్, ఎస్‌ఓటు జీఎం రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

కేకే5 గనిపై పరుచుకున్న పచ్చదనం

- సీఎండీ పేరిట పండ్లతోటల పెంపకం
- ఆహ్లాదకరంగా కేకే5గని

మందమర్రిటౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని కేకే5గని పచ్చదనంతో విలసిల్లుతోంది. ఆరు దశాబ్దాల క్రితం ప్రారంభమైన ఈ గనిలో అప్పటి అధికారులు పెట్టిన మొక్కలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. గని ఆవరణలో క్యాంటీన్ ఎదురుగా పెద్ద మర్రిచె ట్టుతో పాటు ఫ్యాన్ హౌజ్ చుట్టూ యాపచెట్లు ఇతర మొక్కలు ఉన్నాయి. అంతేగాకుండా గని ఆవరణలో కార్మికులు తినేందుకు ఏర్పాటు చేసిన రెస్ట్‌హాల్ చుట్టూ మొక్కలు ఉన్నాయి. గని మేనేజర్ సమీపంలోని ఎదురుగా ఉన్న మూడు ఎకరాల స్థలం వద్ద కూడ మామిడితోట పెంచుతున్నారు. గనికి 200 మీటర్ల దూరంలో పశుపక్షాదుల ఆకలిని తీర్చేందుకు మంకీ ఫుడ్‌కోర్టును ఏర్పాటు చేశారు. సింగరేణి సీఎండీ బల్‌రాం పేరిట వనం కూడ ఏర్పాటు చేశారు. అందులో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. 2020 అప్పుడు డైరెక్టర్‌పా గ ఉన్న ప్రస్తుత సీఅండ్‌ఎండీ బల్‌రాం తోటలో వెయ్యి మొక్కలు నాటారు. కేకే5 చుట్టు దాదాపు వేలాది చెట్లతో నిండుకొని చిన్నపాటి అడవితో పాటు చిన్నతోరణాలను తలపిస్తుంటుంది.



గని సమీపంలో ఏర్పాటు చేసిన బలరాం వనం

అందరి సహకారంతో..



సింగరేణి సీఎండీ మొక్కల నాటడం, పెంపకంలో స్ఫూర్తిగా తీసుకుంటున్నాం. ఆయన పేరిట బలరాం వనంలో వేలాది పండ్ల మొక్కలకు సంరక్షణ చేపడుతున్నాం. అధికారులు, ఉద్యోగుల సహకారంతోనే కేకే5 గని పచ్చని హరితవనంలా మారింది. మొక్కల పెంపకంతో పాటు పర్యావరణ పరిరక్షణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– శంభునాథ్ పాండే, గని మేనేజర్

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

తాండూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య సూచించారు. మంగళవారం తాండూర్‌లోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలన్నారు. మీ సేవ కేంద్రాల్లో ధృవీకరణ పత్రాలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి సమస్యలపై అధికారులు స్పందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నాయకులతో మాట్లాడి సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆయన వెంట ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోత్స్న, సిబ్బంది ఉన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు చేయాలి

బెల్లంపల్లి, జూలై29 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిలోని ప్రధాన రహదారులకు గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే స్థానిక ఎమ్మెల్యే పట్టించుకొని గుంతల రోడ్లకు మరమ్మతులు చేయాలని ఎంసీపీఐయు జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రి నుంచి కొత్త బస్టాండ్ వరకు రోడ్లు భారీ గుంతలు ఏర్పడడం వల్ల వాహనదారులకు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. సంబంధిత అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి సమస్యల పరిష్కరించడం లేదని పేర్కొన్నారు. వెంటనే రహదారులన్ని నూతనంగా నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు రమేశ్, సతీష్, రాహుల్‌లు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతు

మందమర్రిటౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్‌అండ్ పీసీ కార్యాలయం ఎదురుగా మార్కెట్‌కు వెళ్లే రోడ్డుకు మంగళవారం గుర్తింపు సంఘం నాయకులు మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా అధ్వానంగా మారి గుంతలు పడడంతో వచ్చి పోయే వాహనదారులు ప్రమాదాల బారిన పడతున్నారని తెలుసుకుని సింగరేణి సివిల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు సిమెంటు, కంకరతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు. అలాగే పట్టణంలోని మూడవ వార్డు చతలాపూర్‌కు వెళ్లే రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఉద్యోగులకు తాగునీరు సరఫరా చేసే ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించారు. నీటి శాంపుళ్లను మంచిర్యాల ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి పంపించడం జరిగిందని, సురక్షిత నీరు అని రిపోర్టు వచ్చిందని అధికారులు తెలిపారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ వర్షానికి కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానిక జీఎం, సివిల్ అధికారులను కోరగా మరమ్మతులు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమనాధుని సుదర్శన్, సివిల్ నీటి సర ఫరా విభాగం ఇంజనీర్ రాకేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

మంచిర్యాలక్రైం, జూలై29 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ నామినేషన్లలో విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. మంచిర్యాల జిల్లా సైన్స్ కేంద్రంలో గణిత, భౌతిక, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్‌లకు నిర్వహించిన సన్నహాక సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలోనే కాకా దేశంలోనే ముందు వరుసలో ఉంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇన్‌స్పైర్ నామి నేషన్లు దరఖాస్తు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలని అన్నారు. ఈకా ర్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, సమగ్ర శిక్ష కోఆర్డినే టర్లు విజయలక్ష్మీ, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

చెన్నూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణానికి చెందిన కోటిచింతల దిగంగర్ అనే వృద్ధుడు తన మొబైల్ ఫోన్‌ను కొన్ని రోజుల క్రితం పోగొట్టుకున్నాడు. ఈమేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను కనుక్కుని బాధితుడికి మంగళవారం పట్టణ సీఐ దేవేందర్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐకి దిగంబర్ కృతజ్ఞతలు తెలిపాడు.

సమస్యలతో వస్తూ.. సంతోషంగా వెళుతూ..

ప్రజావాణి బాధితులకు భరోసా కల్పిస్తున్న కలెక్టర్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

వందల్లో దరఖాస్తులు

స్పందించి పరిష్కార మార్గం చూపుతున్న అధికారులు

మంచిర్యాలకలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం లేదని, కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టంగా ఉందని ఒకరు.. మా భూమి మాకు దక్కడం లేదు.. కబ్జాకు గురైందని, న్యాయం చేయాలని ఇంకొకరు.. వృద్ధురాలినయ్యా పింఛన్ రావడం లేదని ఓ పండు ముదుసలి.. కొడుకులు సాక డం లేదు.. ఆస్తి తీసుకుని ఇంటి నుంచి గెంటేశారు అని ఓ అమ్మ.. ఇలా ఒకరా, ఇద్దరా వందల మంది తమ తమ సమస్యలను ఏకరువు పెట్టుకుందామని కలెక్టర్ వద్దకు చేరుకుంటున్నారు.

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరవుతూ తమ బాధలను అధికారుల ముందు వెల్లబోసుకుంటున్నారు. అయితే అందరి సమస్యలను ఓపికగా వింటూ కలెక్టర్ వేగంగా స్పందిస్తున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశిస్తూ ప్రతీ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటూ ముందు కు సాగుతున్నారు. ఈనేపథ్యంలో కలెక్టర్ స్పందిస్తున్న తీరును పలు వురు నిరుపేద ప్రజల నుంచి ఆధారా భిమానాలు, అభినందనలు, ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

పరిష్కార మార్గం ఇలా...

కలెక్టర్ వద్దకు వచ్చే సమస్యతో వచ్చిన భూ సమస్యలపై వచ్చిన రైతు లు ఫించన్ ఆశావహులు ఇల్లులేని పేదలపై వచ్చినప్పుడు కలెక్టర్ నేరుగా దరఖాస్తు తీసుకొని ఆర్డీవో ద్వారా ఆ మండలంలో నెలకొన్న భూ వివాదం పై అధికారులను పంపి విచారణ జరిపించారు. భూమి తగాదా ఎలా వచ్చిందో కనుక్కుని వెంటనే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తున్నారు. ఈక్రమంలో వారం రోజుల్లో ఆ సమస్యకు ఫులిస్టాప్ పడుతుంది. పెన్షన్‌దారులకు సంబంధించి సంబం ధిత అధికారులకు సదరన్ సర్టిఫికెట్‌లో ఉన్న నిజనిర్ధారణ శాతాన్ని పరిగణలోకి తీసుకొని వారికి పెన్షన్ అందే విధంగా చూడాలని డీఆర్ డీవో దివ్యాంగులకు సంబంధించిన సమాచారాన్ని అధికారికి వెంటనే చేరవేశారు. దీంతో వారికి పెన్షన్ అందే విధంగా చూస్తున్నారు. సమ స్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

మానవీయ కోణాన్ని చాటుకుంటున్న కలెక్టర్...

పెన్షన్‌దారుల పట్ల కలెక్టర్ మానవీయ కోణంతో వారి సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నారు. తన వద్దకు దరకాస్తుతో అనేక ఇబ్బందుల నడుమ సుదూర ప్రాంతాల నుంచి ట్రైసైకిళ్లు, కర్రలు, వ్యక్తుల సాయంతో తన వద్దకు దరఖాస్తు ఇచ్చేందుకు వచ్చిన దివ్యాంగులు, వృద్ధులపట్ల కలెక్టర్ మానవీయ కోణాన్ని చాటుకుంటున్నారు. వారి సమస్యలను శ్రద్ధగా వింటూ వారికి ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారు. వారి దరఖాస్తులను చూస్తూ అందులో ఏదైనా సమాచారం తక్కువైతే వెంట నే సంబంధిత అధికా రికి చెప్పి సదరు దరఖాస్తులను అప్పటికప్పుడు సరిచేపిస్తూ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాడు. బాధితుల పట్ల కలెక్టర్ చూపిస్తున్న శ్రద్ధతో దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలలుగా వచ్చిన దరఖాస్తులు.. పరిష్కారాలు...

జిల్లాలో మూడు నెలలుగా జిల్లా నలుమూలల నుంచి 518 దరఖాస్తులు వచ్చాయి. అందులో 366 దరఖాస్తులను అధికారులు పరిష్కరించా రు. వివిధ కారణాల వలన మరో 162 పెండింగ్‌లో ఉన్నాయి. ఏ దరఖా స్తును పెండింగ్‌లో పెట్టవద్దని సత్వరమే పరిష్కరించే విధంగా అన్నిర కాల చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలిస్తున్నారు.

ప్రజావాణిపై నమ్మకం కల్పిస్తున్నాం..: కలెక్టర్ కుమార్ దీపక్



జిల్లాలో పేరుకుపోయిన భూతగాదాలు, ఇతరత్ర పేరుకపోయిన సమస్యల పరి ష్కారంతో పాటు అధికారులు, ప్రజాప్రతి నిధులు భాగస్వాములై ప్రజా సమస్యలను పార ద్రోలి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడే విధంగా చేయడమే లక్ష్యం. ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లేందుకు అధికారులను ఎప్పటి కప్పుడు అప్రమత్తం చేస్తున్నాను. జిల్లాలోని మారుమూల ప్రాంతాలతో పాటు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు ప్రతి ఒక చోట నేను పర్యటిస్తున్నాను. ఏ సమస్యనైనా అది పరిష్కారం అవు తుందంటే ఆలస్యం, అశ్రద్ధ చేయకుండా పరిష్కరించేందుకు తగిన బృందాన్ని ఏర్పాటు చేశాను. ఈ మధ్యకాలంలో గిరిజన ఆశ్రమాల్లో వస్తున్న సమస్యలను పారదోలేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. భూతగాదాలు పరిష్కరించేందుకు మండల కమిటీలు, భూభారతి ద్వారా ప్రభుత్వం చేపడుతున్న కొత్త చట్టాన్ని అమలులోకి తీసు కొచ్చేందుకు అవగాహన కల్పిస్తున్నాం.

చిత్తశుద్ధితో పనిచేస్తే విజయం..
పిన్నింటి రాజేశ్వర్, పరిపాలన అధికారి



అంకితభావంతో చిత్తశుద్ధితో పని చేస్తే ఎలాంటి అవాంతరాలు లేకుండా సమస్యలను పరిష్కరించవచ్చు. కలెక్టర్ నేతృత్వంలో మేమంతా అంకితాభావంతో పని చేస్తున్నాం. ఎప్పటికప్పుడు సమావేశాలు, అప్రమత్తతతో వ్యవహరిస్తూ ముందుకు సాగుతున్నాం. బాధితులు ఎవరైనా వారి సమస్య వింటూ వీలైనంత త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తాం



భీమినిలో రేషన్ కార్డు పత్రాలను అందిస్తున్న అధికారులు, నాయకులు

భీమిని, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అర్హత ఉన్న వారం దరికీ రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద లబ్దిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డులను అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు లబ్దిదారులకు పంపిణీ చేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, తహసీల్దార్ బికర్ణ దాస్, ఎంపీ డీవో గంగమోహన్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సంగర్పు రవీందర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ గడ్డం మహేశ్వర్‌గౌడ్, డీటీ గోవర్ధన్, ఆర్ఐ వెంకటేష్, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్, పాల్గొన్నారు.

కన్నెపల్లి : కన్నెపల్లిలోని రైతు వేదికలో మంగళవారం కన్నెపల్లి మండల అధ్యక్షుడు రామాంజనేయ, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావులు లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు గాను బేస్‌మెంట్ పూర్తయిన లబ్దిదారులకు లక్ష రూపాయల చెక్కులను అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, రోహిత్, హన్మంతు, సత్యనారాయణ, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్ఐ చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోటు వర్షపాతమే...!

(5వ పేజీ తరువాయి)

నీరు వచ్చి చేరుతోంది. అలాగే ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 440 క్యూసెక్కులు ఉంది. హైదరాబాద్ మెట్రో పాలిటన్ వర్క్స్ స్కీం కోసం 319 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ఎన్‌టీపీసీ అవసరాల కోసం మరో 121 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

జిల్లాలో 3.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు..

గడిచిన 24గంటల వ్యవధిలో జిల్లాలో 3.8 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు అయింది. భీమిని మండలంలో గరిష్టంగా 9.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా వేమనపల్లి మండలంలో 7.4, నెన్నెల మండలంలో 7.2, భీమారం మండలంలో 6.4, కాసిపేట మండలంలో 5.6, కన్నెపల్లి మండలంలో 5.4, బెల్లంపల్లి మండలంలో 4.8, మందమర్రి మిల్లీమీటర్ల, చెన్నూర్ మండలాల్లో 4.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదు అయింది.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



మొక్కలు నాటుతున్న డీఈవో యాదయ్య

తాండూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు విద్యార్థుల చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈవో యాదయ్య సూచించారు. మంగళవారం మండలంలోని తంగళ్లపల్లిలోని ప్రాథమిక, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలను సందర్శించారు. రికార్డులు, ఉపాధ్యాయుల డైరీలను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు.

ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అనంతరం పాఠశాలలో పూల, పండ్ల మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో మల్లేశం, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఉన్నారు.

వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి

జైపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు, వైద్య సిబ్బంది అం దుబాటులో ఉండి వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అప్పాల ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జైపూర్ పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగ్యూ, మలేరియా కేసులు ఏమైనా నమోద వుతున్నాయా అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయ ణ, గురుకుల ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కావెంకటేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ సంపత్ పాల్గొన్నారు.

శునకాన్ని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

కాసిపేట, జూలై29 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం బావిలో పడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న శునకాన్ని బెల్లంపల్లి అగ్నిమాపక సిబ్బంది కోమటిచేను యువరాజ్యం యూత్ సభ్యులు కాపాడి మానవత్వం చాటుకున్నారు. కోమటిచేను ఊరి శివారులోని పాడు బడ్డ బావిలో వారం క్రితం కుక్క బావిలో పడింది. ప్రతి రోజు రహదారి వెంట వెళ్తున్న వారు గమనిస్తున్నారు కానీ బయటకు తీయడానికి ఎవరు సాహసించలేదు. కోమటిచేను యువ రాజ్యం యూత్ సభ్యులు స్పందించి దానిని కాపాడేందుకు ప్రయత్నించారు. కానీ వీరితో కాలేదు. బెల్లంపల్లి విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖకు సమాచారం అందించడంతో వెంటనే స్పందించి రంగంలోకి దిగి కుక్కను ప్రాణాలతో కాపాడారు. సకాలంలో స్పందించిన యువరాజ్యం యూత్ సభ్యులతో పాటు అగ్నిమాపక సిబ్బందిని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రవి కుమార్, ప్రభాకర్, వేణుగోపాల్, సత్యనారాయణ, యువరాజ్యం యూత్ అధ్యక్షుడు జనగామ శ్రీనివాస్, మాసు సుధాకర్, పాల్గొన్నారు.

బదిలీ అధికారికి సన్మానం



ఏపీఎం రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మహిళ సంఘం సభ్యులు

జైపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జైపూర్ ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ బదిలీపై కాసిపేట మండలానికి వెళ్తుండగా మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ జైపూర్ మండలంలో ఐదు సంవత్సరాలుగా విధులు కొనసాగించానని, ఇందుకు సహకరించిన మహిళ సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు మాలతి, సీసీలు, సీఏలు పాల్గొన్నారు.

సినారె జయంతి

లక్షెట్టిపేట, జులై 29(ఆంధ్రజ్యోతి): అక్షర సాహితీ సృజన కళావేదిక ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో మంగళవారం జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత పద్మభూషణ్ ఆచార్య సింగిరెడ్డి నారాయణ రెడ్డి జయంతి వేడుకను కవులు ఘనంగా నిర్వహించారు. కవులు సినారే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు నూ టెంకి రవీంద్ర మాట్లాడుతూ తెలుగు సాహితీ జగత్తులో వెలుగు దివ్వె సినారే అని కొనియాడారు. ప్రతీ కవి, ప్రతీ రచయిత ఆయన ఆశయాలను నెమరివేస్తు తన మార్గంలో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు కందుల తిరుపతి, కవులు లేదాళ్ల రాజేశ్వర్‌రావు, రాచకొండ శ్రీనివాస్, పురం సుధాంశ్, కోమాకుల సందీప్, బిరుదుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పులుల సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్

కాసిపేట, జూలై29 (ఆంధ్రజ్యోతి): అడవికి రాజు పెద్దపులి. దీనిని సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్, దేవాపూర్ ఎఫ్ఆర్‌వో అనిత అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం దేవా పూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో దేవాపూర్ ఎఫ్ఆర్‌వో అనిత, మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ కార్యక్రమాలు నిర్వహించారు. బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవులను కాపాడుకోవాలంటే అడవిలో పెద్దపులుల అవసరం ఎంతో ఉంది. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మోడల్ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, ప్రవీణ్‌నాయక్, గౌరి శంకర్, శ్రీనివాస్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఖలీల్, ఆశ్రమ హైస్కూల్ హెచ్‌ఎం రొడ్డ గోపాల్, ఉపాధ్యాయులు అశోక్, గణేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల : జాతీయ జంతువు పెద్దపులిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కుశ్నపల్లి అటవి క్షేత్రాధికారి పి.దయాకర్ అన్నారు. అంతర్జాతీ య పులుల దినోత్సవాన్ని మంగళవారం నెన్నెలలో ఘ నంగా జరుపుకున్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం స్థా నిక హైస్కూల్‌లో పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. డిఫ్యూటీ రేంజ రు లక్ష్మీనారాయణ, రూపేష్, ఎఫ్ఎస్‌వోలు బేగ్, రాందాస్, శ్రీలత, ఎఫ్‌బీవోలు శ్రీనాథ్, శంకర్, పాల్గొన్నారు.

వేమనపల్లి : అడవుల రక్షణకు పెద్ద పులులే కీలకమని, పులులను వృద్ధి చేసేందుకు సహకరించాలని నీల్వాయి ఎఫ్ఆర్‌వో హఫీజుద్దీన్ పేర్కొన్నారు. మం గళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా నీల్వాయిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీల్వాయి అటవీ ప్రాంతంలో వివిధ రకాల వన్య ప్రా ణులు, పక్షులు ఉన్నాయని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌రెడ్డి, అటవీ అధికారులు ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

దండేపల్లి : జీవవైవిధ్యానికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్న పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి బుచ్చన్న అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం పురష్కరించుకోని గుడిరేవు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలోని పులుల సంరక్షణపై విద్యార్థులకు నాటకం ద్వారా అవగాహన కల్పించారు.

గురుకుల కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్‌లు

జైపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 31న జిల్లాలోని అన్ని సాంఘీక సంక్షేమగురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్‌ల కోసం ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని మంచిర్యాల డీసీవో కేల నాగేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం మంచిర్యాల, జైపూర్, కోటపల్లి బాయ్స్, లక్షెట్టిపేట, మందమర్రి, చెన్నూరు గర్ల్స్, సీఈసీ గ్రూపులో బెల్లంపల్లి గర్ల్స్ కాసిపేట బాయ్స్ గురుకులాల్లో ఖాళీగా ఉన్నాయన్నారు. ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

31న మిగులు సీట్ల బర్తీ

లక్షెట్టిపేట: ఈ నెల 31వ తేదీన ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడి యట్ మిగులు సీట్ల భర్తీ కోసం స్పాట్ కౌన్సిలింగ్ నిర్వ హిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమాకళ్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని విద్యార్థులు చేసుకున్న దరకాస్తులను మధ్యాహ్నం ఒంటి గంట వరకు రిజిస్ట్రేషన్ చేసిన అనంతరం గంట తర్వాత విద్యార్థుల మెరిట్ లిస్టును నోటీసు బోర్డుపై అంటిస్తామన్నారు.

బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి నోటిఫికేషన్

హాజీపూర్: జిల్లా లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిన ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ముల్కల్ల ఎస్సీ గురుకుల ప్రిన్సిపాల్ మోహన్ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ ఎస్సీలో 9, ఎస్‌టీ 2, బీసీ 4, ఓసీ 2 మొత్తం 17 సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. బైపీసీలో ఎస్సీ 16, ఎస్టీ 2, బీసీ 4, ఓసీ2, మైనార్టీ 1, మొత్తం 25 ఖాళీగా ఉన్నట్లు ఈ నెల 31న ముల్కల్లలోని ఎస్సీ గురుకులంలో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించబడునని పేర్కొన్నారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు దరఖాస్తులు సమర్పించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అడ్మిషన్లు రిజర్వేషన్ ప్రకారం, పదోతరగతిలో వచ్చిన మార్కుల ప్రతిపాదికన కేటాయించబడతాయని తెలిపారు.

మృతదేహంతో ఆందోళన

మంచిర్యాల క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సహస్ర మృతదేహంతో ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బంధువులు మాట్లాడుతూ సహస్ర ఆత్మహత్యపై అనుమానాలున్నాయని అన్నారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ అక్కడకు చేరుకుని ఆందోళన విరమింపజేశారు.

కార్యవర్గం ఎన్నిక

కోటపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండల పద్మశాలి సంఘం ఎన్నికను మంగళవారం చేపట్టారు. సంఘం మండల అధ్యక్షుడిగా అలకాటి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా రంగు సంతోష్, కోశాధికారిగా కిరణ్, గౌరవాధ్యక్షులుగా రంగు రమణయ్య, ఉపాధ్యక్షులుగా రాజేష్, దే వులపల్లి సంపత్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా అధ్యక్షుడు గాదాసు బాపు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవసాని నాగరాజు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్

విద్యార్థులకు కిట్లు పంపిణీలో రఘునాథ్



విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ అందిస్తున్న రఘునాథ్

నస్పూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్య, క్రమ శిక్షణతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా రాణించాలని ఫౌండేషన్ చైర్మన్ రఘునాథ్ అన్నారు. నస్పూర్ పట్టణం తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా రఘునాథ్ మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం కింద ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ కోట్లాది నిధులు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాజుల ముఖేష్ గౌడ్, మిట్టపల్లి మొగిలి, కుర్ర చక్రి, రమేష్, కట్కూరి తిరుపతి, సతీష్, సుమన్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన యువకులు

కాసిపేట, జూలై29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాపూర్ ధర్మరావుపేటకు చెందిన పలువురు యువకులు మంగళవారం బీజేపీ పార్టీలో చేరారు. వీరికి బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్‌గౌడ్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి రఘునాథ్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తట్టి వెంకటకృష్ణ, కాసిపేట మండల అధ్యక్షులు నూరం సంపత్, ప్రధాన కార్యదర్శి దేవునూరి సంతోష్, ముదాం ప్రశాంత్, ముత్యాల రవి తదితరులు పాల్గొన్నారు.



ఆంక్షలు ఎత్తివేయాలని వినతి

జన్నారం,జూలై29(ఆంధ్రజ్యోతి): కవ్వాల్‌టైగర్‌జోన్‌లో ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో భారీ వాహనాలు అనుమతించకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని అంతేగాకుండా చేతి వృత్తిదారులకు జీవనోపాధి కరువైందని జన్నారం మండల అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నారు. ఈకార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ సభ్యులు రాజన్న, నర్సయ్య, మల్లేశ్, శంకర్‌లతో పాటు పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

● జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రునాయక్



డీలర్లతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రునాయక్

నెన్నెల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : యూరియా కృతిమ కొరత సృష్టిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి బి. ఛత్రునాయక్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులు, గోదాములను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం రైతువేదికలో మండల ఎరువుల డీలర్లతో సమావేశమయ్యారు. యూరియా ఎంఆర్‌పీకే విక్రంచి వివరాలతో కూడిన రసీదు తప్పకుండా ఇవ్వాలన్నారు. దుకాణం ఎదుట ధరలు, స్టాక్ వివరాలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆన్‌లైన్ స్టాక్, గ్రౌండ్ స్టాక్ సమానంగా ఉండాలన్నారు. అనంతరం రైతులతో కలిసి రైతునేస్తం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. భీమిని ఏడీఏ సురేఖ, నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల ఏవోలు పుష్పాల సృజన, ప్రశాంత్, యమున, వీరన్న, డివిజన్ ఏఈవోలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

చెన్నూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం అయినందున పారిశుధ్య పనులను గ్రామాల్లో ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. మంగళవారం కత్తెరశాల గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్తా, చెదారం లేకుండా చూడాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. అలాగే అంగ్రాజ్‌పల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నితనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. చెన్నూరులోని ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ ఆలీ, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

లోటు వర్షపాతమే..!

● జిల్లాలో సాధారణం కంటే తక్కువ నమోదు
● ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో చేరని నీరు
● కుంటలు, చెరువులదీ అదే పరిస్థితి
● ఎల్లంపల్లి ప్రాజెక్టులోనూ అంతంతే..

మంచిర్యాల, జూలై29 (ఆంధ్రజ్యోతి): అల్పాపీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నప్పటికీ ఆశించినమేర వర్షపాతం లేదనే చెప్పాలి. ఇటీవల వరుసగా వర్షాలు కురిసినప్ప టికీ చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి ఆశించిన మేరు నీరు చేరలేదు. రెండు మూడు సంవత్సరాలతో పోల్చితే లోటు వర్షపాతమే జిల్లాలో నమోదు అయింది. ఒకటిరెండు భారీవర్షాలు కురిసినప్పటికీ అధికంగా ముసురు కమ్ముకోవడంతో పెద్దగా నీరు చేరలేదు. వర్షకాలం ప్రారంభమై దాదాపు 45రోజులు గడుస్తున్న పరిస్థితి ఎప్పటిలాగే ఉంది.

బోసిగా జలాశయాలు...

లోటు వర్షపాతం కారణంగా జిల్లాలోని మధ్యతరహా, పెద్దప్రాజెక్టులు బోసిపోతున్నాయి. జిల్లాలో ప్రధాన ప్రాజెక్టు అయిన ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఇప్పటి వరకు కేవలం పది టీఎంసీల నీరు మాత్రమే చేరింది. జిల్లా వ్యాప్తంగా 650 చెరువులు ఉండగా ఎక్కడ కూడ నీరు మత్తడి దూకిన సందర్భాలు లేవు. అలాగే వాగులు, వంకల్లోను చెప్పుకోదగ్గ నీరేమి చేరలేదు. గత ఏ డాది ఈ సమయానికి జిల్లాలో చెరువులు, ప్రాజెక్టులు నీటితో కళకళలాడాయి. జిల్లాను ఆనుకొని ప్రవహిస్తున్న గోదావరిలోను కనీస స్థాయి నీరు చేరలేదు. ఎగువన కడెం ప్రాజెక్టు ఒక గేటు తెరచి గోదావరిలోకి నీటిని వదులుతున్న అది ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకే పరిమితం అవుతుంది. ఈ ఏడాది జిల్లా సగటు వర్షపాతం 29శాతం లోటు నెలకొంది. అల్పపీడన ప్రభావంతో వారం రోజుల్లో చాలా ప్రాంతాల్లో అధిక వానలు పడ్డాయి. జిల్లాలోని పలు మండలాల్లో సాధారణ వర్షపాతం ఉండగా మిగితాచోట్ల లోటువర్షపాతమే నమోదు అయింది.

ప్రాజెక్టుల్లో అరకొర నీరే...

జిల్లాలో ఎల్లంపల్లి, ర్యాలీవాగు, గొల్లవాగు, నీల్వాయి రిజర్వాయర్లు ఉన్నాయి. వీటిలో నేటి వరకు ఆశించని నీరు చేరకపోవడంతో ఆందోళ నకర పరిస్థితులు నెలకొన్నాయి.

ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద...

ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా గుడిపేట సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద కొనసాగు తోంది. ప్రాజెక్టు గరిష్ట ఎత్తు 148 మీటర్లు కాగా ప్రస్తుతం 144.20 మీటర్ల ఎత్తు వరకు నీరు ఉంది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకుగాను 11.0713 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 2254క్యూసెక్కుల..

(తరువాయి 7లో)



ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం

రిజర్వాయర్	సామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుత నిల్వ(టీఎంసీలు)
ఎల్లంపల్లి	20.175	11.0713
ర్యాలీవాగు	0.4085	0.0713
గొల్లవాగు	0.5675	0.1394
నీల్వాయి	0.846	0.429

అతిథి ఉపాధ్యాయుల నియామకానికి ఇంటర్వ్యూలు

హాజీపూర్, జూలై29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపులే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిన బోధించేందుకు అతిథి ఉపాధ్యాయుల నియామకాలకు ఈనెల 31న డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఆర్‌సీవో శేరు శ్రీధర్ ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు హిందీ 1, ఇంగ్లీషు 1, జూనియర్ లెక్చరర్ 1, గణితం మహిళ 1, జువాలజీ జెఎల్ మహిళ 1, సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఈనెల 31న లక్సెట్టిపేటలోని ఎంజేపీ బాలుర పాఠశాలలో ఉదయం 9గంటలకు బయోడేటా, విద్యార్హతల పత్రాలను తీసుకురావాల్సిందిగా తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎన్‌హెచ్ఆర్‌సీ పరామర్శ

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిటీ మంచిర్యాల జిల్లా మాజీ అధ్యక్షుడు నిమ్మరాజుల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెంగా ఆయన కుటుంబాన్ని మంగళవారం ఎన్‌హెచ్ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య పరామర్శించారు. శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబీకులకు 50కిలోల బియ్యం, రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య, కార్యదర్శి ఓడేటి చంద్రశేఖర్, సాంబశివరావు, రవీందర్, నటేశ్వర్, యశ్వంత్, ముక్తేశ్వర్, శ్రీనివాస్, పోచన్న, లవకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా నాగుల పంచమి

చెన్నూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం శుద్ధ చవితి, పంచమి తిధులను పురస్కరించుకుని చెన్నూరు పట్టణంలోని అం బా అగస్త్యేశ్వర ఆలయంలో మంగళవారం నాగుల పంచమి వేడుకల ను ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయంలో కొలువై ఉన్న నాగేంద్రుని పుట్టల్లో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు.

నస్పూర్ : నస్పూర్ పట్టణంలో మంగళవారం నాగుల పంచమి ని భక్తిశ్రద్ధలతో మహిళలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలు, పు ట్టల వద్ద పూజలు చేశారు. పుట్టల్లో పాలుపోసి, నైవేద్యాలను సమ ర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లపాపలను చల్లంగా చూడ మని వేడుకున్నారు.

దండేపల్లి : మండలంలో మంగళవారం మహిళలు భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలను జరుపుకున్నారు. నాగదేవతకు ప్రత్యేక పూజాలు చేశారు. ఆలయాలు, పాముల పుట్ట వద్ద మహిళలతో సందడి నెలకోంది.

లక్సెట్టిపేట: పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం నాగుల పంచమి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.



చెన్నూరులో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

రోడ్డుకు మరమ్మతులు చేయండి



నిరసన వ్యక్తం చేస్తున్న వార్డు ప్రజలు

మందమర్రిటౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 15వ వార్డు శ్రీపతినగర్, దీపక్‌నగర్, భగత్‌సింగర్ నగర్‌లోని రోడ్లపై గుంతలు పడడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని, రోడ్డుకు మరమ్మతులు చేయాలని వార్డు ప్రజలు కోరారు. మంగళవారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. రోడ్డు అధ్వానంగా మారిన విషయాన్ని సింగరేణి జీఎం దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఈ రోడ్డంతా గుంతలమయం కావడంతో రాత్రి వేళల్లో వచ్చే వారు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరారు. రాష్ట్ర గనులు, కార్మిక శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రాగిజావ ఎప్పుడు?

● గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ
● ఈ విద్యాసంవత్సరం నిలిచిన సరఫరా

6

సంస్కారంతో మెదిలితే ఏదైనా సాధించవచ్చు

● కేంద్రీయ విద్యాలయ ప్రారంభోత్సవ సందర్భంగా కలెక్టర్ కుమార్‌దీపక్



కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బడులు పాఠాలు నేర్పుతాయి, సమాజం పట్ల సంస్కారంతో మెదిలితే జీవితంలో ఏదైన సాధించ వచ్చునని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయ నూతన భవనాన్ని ఎస్పీఏడీ దుర్గప్రసాద్, జిల్లా సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్, 13వ బెటాలియన్ అదనపు కమాండెంట్‌లతో కలిసి కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలల ద్వారా జ్ఞానం, క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తామన్నారు. ఏ పాఠశాలలో అయినా ఒక ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులు మాత్రమే చదువు కుంటారని, కాని కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలల్లో వివిధ ప్రాంతాలు, బాషలు, భిన్న సంస్కృతుల నుంచి వచ్చిన విద్యార్థులు ఒకే వేదికగా విద్యను అభ్యసిస్తారని తెలిపారు. ఏకాగ్రతతో కష్టపడేవారు విజయాలు సాధిస్తారని జీవితంలో ఎదుర్కొనే హెచ్చుతగ్గులను అధిగమించి ఉన్నత స్థానాలకు ఎదుగుతారని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, కళలు, ఇతర ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని సమాజంపై అవగాహన పెంచుకో వాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కేవీ పాఠశాలల ఆర్‌ఓలు చంద్రమౌళి, పవన్ కుమార్, ఎంజేపీ ఆర్‌సీవో శ్రీధర్, తహసీల్దార్ శ్రీనివాస్ రావుదేశ్ పాండే, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ దిలీప్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండలంలో కలెక్టర్ పర్యటన

మండలంలో మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్ విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మండలంలోని రిజిష్టర్‌లు, పారిశుధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. అనంతరం మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాన్ని ఏవో క్రిష్ణతో కలిసి తనిఖీ చేశారు. ప్రభుత్వ ప్రాథమి కోన్నత పాఠశాల, భవిత కేంద్రం, సబ్బెపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు.

కిక్ బాక్సింగ్ యూనియన్ జిల్లా కార్యవర్గం



ఎన్నికైన జిల్లా కిక్ బాక్సింగ్ కార్యవర్గం

నస్పూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని సాధన స్పోర్ట్స్ డిఫెన్స్ ఆకాడమిలో కిక్స్‌బాక్సింగ్ యూనియన్ ఇండియా అధ్యక్షుడు కొండిల్ల సదానందం ఆధ్వర్యంలో మంగళవారం కిక్స్ బాక్సింగ్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ మాస్టర్ రంగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల చరిష్మ, కోశాధికారి, టెక్నికల్ డైరెక్టర్‌గా కట్ల సత్యనారాయణ, ఉపాధ్యాక్షులుగా రంగ ఓదెలు, పుట్ట వంశీకృష్ణ, ముఖ్య సలహాదారుడిగా జబర్దస్త్ దమ్మాల శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటాలి

● తెలుగు రాష్ట్రాల(ఆర్‌జీపీఆర్‌ఎస్) ఇన్‌చార్జి సుభాష్ యాకరాన్

మంచిర్యాలక్రైం, జూలై29 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ సత్తాచాటి అభ్యర్థులు గెలిచేలా నాయకులు, కార్యకర్తలు ప్రణాళికలు రూపొందించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల (ఆర్‌జీపీఆర్ఎస్) ఇన్‌చార్జి సుభాష్ యాకరాన్ పిలుపునిచ్చారు. మంచిర్యాల పట్టణం ఎంక స్వెన్షన్‌హాల్‌లో గడ్డం త్రిమూర్తి అధ్యక్షతన జిల్లా రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామంలో యువత కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామ సర్పంచ్‌లను నేతలు దగ్గర ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉన్న గ్రామీణ నాయకులను గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులతో సమావేశాలు నిర్వహించాలని, పట్టణ, గ్రామీణ స్థానిక పాలనలోఅనుభవం ఉన్న నాయకులతో మండలాల సమావేశాలు నిర్వహించాలన్నారు. సర్వోదయ సంకల్ప శిబిరాలను ఏర్పాటు చేసి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో నాయకులు తూముల నరేశ్, పూదరి తిరుపతి, జిల్లా మాజీ, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ, ఏపీ (ఆర్‌జీపీఆర్‌ఎస్) ఇంచార్జీ సుభాష్ యాకరాన్

సమస్యలతో వస్తూ..సంతోషంగా వెళ్తూ

● ప్రజావాణిలో బాధితులకు భరోసా కల్పిస్తున్న కలెక్టర్

7

విద్యార్థులకు అడవిపై అవగాహన ఉండాలి

జన్నారం, జూలై29 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి అటవీపై అవగాహన ఉండాలని ఎఫ్ఆర్‌వో శ్రీధరాచారి అన్నారు. మంగళవారం తలమడుగులోని వివేకానంద పాఠశాలలో పులుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్ర, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో అటవీశాఖ సిబ్బందితో పాటుపాఠశాల కరస్పాండెంట్ సతీష్, తిరుపతి పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: ఆటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని గుడ్‌షెపర్డ్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఫారెస్టు సెక్షన్ అధికారి అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రతీ ఏటా జూలై 29న అటవీశాఖ ఆధ్వర్యంలో జాతీయ పులుల దినోత్సవంను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. పులుల ఆవశ్యకతను తెలియజేయడం కోసం పులులపై అదే విధంగా అటవీ సంపద వాటి ఉపయోగాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించామన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వై.శ్రీనివాస్, ప్రిన్సిపల్ సెబస్టాయిన్, ఎఫ్‌బీవోలు అత్తె సత్తన్న, రాజశేఖర్, సుమలత, రాజమణి, ఎనిమల్ ట్రాకర్ కలీమ్ పాల్గొన్నారు.

భీమారం : ఇంటర్నేషనల్ టైగర్స్ డే సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలోని విద్యార్థులకు అటవీ శాఖ అధికారులు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పర్యావరణ సమతుల్యత, అటవీ సంరక్షణలో టైగర్‌ల ప్రాముఖ్యత అనే అంశంపై పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. డిప్యూటి రేంజ్ ఆఫీసర్ సుధాకర్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, అటవీ సిబ్బంది రాజవ్వ, శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అటవీశాఖ సిబ్బంది

తండాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

కోటపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : తండాల గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామపం చాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు తండాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి మండల యూత్ అధ్యక్షుడు బాపునాయక్ అన్నారు. మంగళవారం సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో లంబాడ జనాభాను బహిర్గతం చేయాలని, లంబాడీలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో వంద శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని, ఎమ్మెల్యే , ఎంపీల స్థానాల పెంచే పునర్విభజనలో రాష్ట్ర జనాభా యూనిట్ కాకుండా జిల్లా జనాభా యూనిట్ ఆధారంగా ఎస్టీలకు ఎమ్మెల్యే, ఎంపీ రిజర్వేషన్ సీట్లు కేటాయించాలన్నారు. అలాగే లంబాడీల గోర్‌బోలి భాషను అధికారికంగా గుర్తించి కేంద్రం 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31న హైద్రాబాద్‌లో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని , దీనికి ప్రతి గ్రామం, తండా నుంచి లంబడీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు అరుణ్‌నాయక్, రఘునాయక్, సాయినాయక్, అభినాయక్, శేఖర్‌నాయక్, వంశీనాయక్, అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.